RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

WEB : WWW.rajadhanivoice.com rajadhanivoicedaily@gmail.com




సంపుటి : 02 | సంచిక : 248 | 31 శుక్రవారం జూలై 2026 | ఎడిటర్ : పూర్ణ చంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

## గ్లోబల్ ఇన్వెస్టర్ల ఎంపిక ఆంధ్రప్రదేశ్

**గత ప్రభుత్వ చర్యలతో పెట్టుబడిదారుల విశ్వాసం కోల్పోయింది**
**త్వరలో ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు క్లీన్ ఎనర్జీ ఎగుమతులు**
**పరిశ్రమలు తేవడం మా బాధ్యత -- కష్టపడటం యువత బాధ్యత**
**టాటా రెన్యువబుల్ ఎనర్జీ శంకుస్థాపన సభలో మంత్రి నారా లోకేష్**

**రాజధాని వాయిస్ పత్తికొండ, జూలై 30 :** ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల తొలి ఎంపిక అయ్యిందని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బ్రూక్‌ఫీల్డ్, బ్లాక్‌స్టోన్, బ్లాక్‌రాక్, EQT, TPG వంటి గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్‌లు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని, టాటా పవర్, సుజ్లాన్, రెన్యూ, ప్రీమియర్ ఎనర్జీస్, ాజవీజు, వారీ వంటి ప్రముఖ భారతీయ కంపెనీలు ఇక్కడ విస్తరిస్తున్నాయని లోకేష్ వెల్లడించారు. పత్తికొం ద సమీపంలోని హోసూరులో టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ (TPREL) ఆధ్వర్యంలో రూ.5,350కోట్లతో అనంతపు రం, కర్నూలు జిల్లాల్లో ఏర్పాటుచేయబోయే 800 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు గురువారం మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో లోకేష్ మాట్లాడు తూ... గత ఏడాదితో పోలిస్తే, ఈ ఒక్క సంవత్సరంలోనే ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 400% పెరిగిందని, ఇది రాష్ట్ర విశ్వసనీయతను పునరుద్ధరించడం వల్లే సాధ్యమైందన్నారు.




**పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంపొందించాం**

రాష్ట్రంలో 2024 జూన్ లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు, పునరుత్పాదక ఇంధన - మిగతా 2లో..

## రాజ్యసభ ముందుకు యాంటీ పేపర్ లీక్ బిల్లు



ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధానికి ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ పరీక్షల (అనుచిత పద్ధతుల నివా రణ) సవరణ బిల్లు 2026' రాజ్యసభ ముందుకు వచ్చిం ది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ దీనిని సభలో ప్రవే శపెట్టారు. దీనిపై ఏడు గంటల పాటు చర్చించాలని నిర్ణయిం చారు.ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాల లీకులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, ఏమాత్రం సహించే ప్రసక్తే లేదన్నారు. పిల్లల భవిష్యత్తును ప్రమా దంలో పడేయడాన్ని అనుమతించబోమన్నారు. దేశంలోని విద్యార్థు లు, యువత సంక్షేమాన్ని పరిరక్షించడంలో ప్రభుత్వ నిబద్ధతకు ఈ బిల్లు నిదర్శనమని చెప్పారు. ఈ బిల్లును తీసుకురావడానికి ప్రధాని ఏ మాత్రం ఆలస్యం చేయలేదని కేంద్ర మంత్రి వెల్లడించారు.

**ఆయన రాజీనామా చేసి మోదీ కుర్చీ కాపాడారు: ఖర్గే**

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి ప్రధాని మోదీ కుర్చీ కాపాడారని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మాట్లాడుతూ.. "నీట్ పేపర్ లీక్ వల్ల చాలా మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. పేపర్ లీక్ కాకుండా ప్రభుత్వం ఏమాత్రం ముందస్తు చర్యలు చేపట్టలేదు. 2024లోనే ఈ బిల్లును ఎందుకు తీసుకురాలేదు? దిల్లీలో విద్యార్థుల విషయం లో పోలీసులు వ్యవహరించిన తీరుపై అమిత్‌షా ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ ఘటనకు ఆయన బాధ్యత వహించాల్సిందే" అని అన్నారు.

## మద్యం కుంభకోణంలో
# కీలక మలుపు

**ఏసీబీ కోర్టును ఆశ్రయించిన పదో నిందితుడు**
**లొంగిపోవడానికి అనుమతి కోరుతూ పిటిషన్**
**హవాలా లావాదేవీల్లో కీలక పాత్ర ఆరోపణలు**
**దర్యాప్తులో మరిన్ని వివరాలు వెలుగుచూసే అవకాశం**

**రాజధాని వాయిస్ విజయవాడ, జూలై 30 :** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో పదో నింది తుడిగా ఉన్న సైఫ్ అహ్మద్ విజయవాడ అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఎదుట లొంగిపోయేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆయన పిటిషన్ దాఖలు చేయడంతో ఈ వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. మద్యం కుంభకోణం కేసు నమోదు అనంతరం సైఫ్ అహ్మద్ విదేశాలకు వెళ్లినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. అప్పటి నుంచి ఆయన కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆయనే స్వచ్ఛందంగా న్యాయస్థానం ఎదుట లొంగిపోవడానికి అనుమతి కోరడం దర్యాప్తు పరంగా ప్రాధాన్యత సంతరించుకుంది.దర్యాప్తు సంస్థల సమాచారం ప్రకారం, ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన రాజ్ కెసిరెడ్డికి సైఫ్ అహ్మద్ అత్యంత సన్నిహితుడిగా ఉన్నట్లు గుర్తించారు. మద్యం కుంభకోణానికి సంబంధించిన భారీ మొత్తాల అక్రమ నగదు లావాదేవీలు, హవాలా మార్గంలో నిధుల బదిలీల్లో ఆయన కీలక పాత్ర పోషించారని ప్రత్యేక దర్యాప్తు బృందం ఆరోపిస్తోంది. ఈ కేసులో సేకరించిన ఆధారాల ప్రకారం సైఫ్ అహ్మద్ ఆర్థిక లావాదేవీల నిర్వహణలో కీలకంగా వ్యవహరించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. నిధుల మళ్లింపు, అక్రమ లావాదేవీలకు సంబంధించిన పలు అంశాలపై ఇప్పటికే దర్యాప్తు కొనసాగుతుం డగా, ఈ పరిణామం కేసు విచారణను మరింత వేగవంతం చేసే అవకాశాలు కనిపిస్తున్నా యి.సైఫ్ అహ్మద్ లొంగిపోయిన అనంతరం ఆయనను ప్రత్యేక దర్యాప్తు బృందం అదుపులోకి తీసుకుని విచారించే అవకాశం ఉందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి. ఆయన విచారణ ద్వారా ఈ కుంభకోణానికి సంబంధించిన మరికొందరి పాత్ర, నగదు బదిలీల మార్గాలు, ఇతర కీలక అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే సైఫ్ అహ్మద్ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం ఇంకా నిర్ణయం వెలువరించాల్సి ఉంది. కోర్టు ఆదేశాల మేరకు తదుపరి న్యాయ ప్రక్రియ కొనసాగనుండగా, ఈ కేసులో ఆయన లొంగుబాటు మద్యం కుంభకోణం దర్యాప్తులో మరో కీలక ఘట్టంగా మారే అవకాశముందని న్యాయ, దర్యాప్తు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




## నీట్ ఆందోళనలు.. చట్టపరమైన చర్యలు వద్దు: దిల్లీ ప్రభుత్వం

దిల్లీ: నీట్ పేపర్ లీకేజీని ఖండిస్తూ జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలిపిన ఆందోళనకారులపై చట్టపరమైన చర్యలు తీసుకోబోమని దిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. నిరసనల్లో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. అయితే, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం.. ఇప్పటికే నేర చరిత్ర కలిగిన వ్యక్తులకు ఈ మినహాయింపు వర్తించదని స్పష్టం చేసింది. మరోవైపు జులై 29న జరిగిన ఆందోళనల్లో 13 కేసులు నమోదైనట్లు దిల్లీ ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీని నిరసిస్తూ కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) ఇటీవల చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తంగా మారిన సంగతి తెలిసిందే. చలో పార్లమెంట్ కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున నిరసనకారులు రోడ్లమీదకి రావడంతో పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. పలువురిపై కేసులు నమోదయ్యాయి.

## భోగాపురం వేడుకలకు ధింసా సన్నాహాలు




## మచిలీపట్నం పేరుతో యుద్ధ నౌక

**జాతీయ స్థాయిలో బందరుకు గుర్తింపు**
**జలాంతర్గామి విధ్వంసక నౌక నిర్మాణం**
**కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో నిర్మాణ పనులు**
**హర్షం వ్యక్తం చేసిన కొల్లు రవీంద్ర**

**రాజధాని వాయిస్ మచిలీపట్నం, జూలై 30 :** గేట్‌వే ఆఫ్ అమరావతిగా రూపుదిద్దుకుంటున్న మచిలీపట్నం పోర్టు పేరుతో భారీ జలాంతర్గామి విధ్వంసక యుద్ధ నౌక నిర్మాణం జరగడం ఆనందదాయకమని ఆంధ్రప్రదేశ్ గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. భారత నౌకాదళం కోసం కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ నిర్మిస్తున్న ఎనిమిది జలాంతర్గామి విధ్వంసక నౌకల్లో ఒకదానికి మచిలీపట్నం పేరు పెట్టడం బందరు ప్రజలకు గర్వకారణమని అన్నారు. మచిలీపట్నం పేరు జాతీయ స్థాయిలో ప్రతిష్ఠను సంతరించుకోవడం వెనుక ఈ యుద్ధ నౌక నిర్మాణం కీలక మైలురాయిగా నిలుస్తుందని కొల్లు రవీంద్ర అభిప్రాయపడ్డారు. సముద్ర రక్షణలో కీలక పాత్ర పోషించే యుద్ధ నౌకకు చారిత్రక ప్రాధాన్యం కలిగిన మచిలీపట్నం పేరు పెట్టడం ద్వారా ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు లభించిందని పేర్కొన్నారు.భారత నౌకాదళం సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మొత్తం ఎనిమిది జలాంతర్గామి విధ్వంసక నౌకలను నిర్మిస్తోంది. అందులో మచిలీపట్నం పేరుతో నిర్మిస్తున్న నౌక అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందుతోంది. ఈ నౌక సముద్ర భద్రత, తీర ప్రాంత రక్షణలో కీలక బాధ్యతలు నిర్వర్తించనుంది. మిగతా 2లో..






## అంబటి ఇంటిపై దాడిని ఖండించిన పిన్నెల్లి

- దాడి ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం
- బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్
- శాంతిభద్రతలపై ప్రభుత్వాన్ని విమర్శించిన మాజీ ఎమ్మెల్యే
- ప్రజాస్వామ్యంపై దాడులను అరికట్టాలని పిలుపు

**మాచర్ల, జూలై 30 :** మాజీ మంత్రి అంబటి రాంబాబు నివాసం, కార్యాలయంపై ఇటీవల జరిగిన దాడిని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ దాడికి ప్రోత్సాహం ఇచ్చిన వారిపై తక్షణమే చర్యలు తీసుకుని, గుంటూరు ఎంపీ, ఎమ్మెల్యే, ఆమె భర్తను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులకు నిదర్శనమని ఆయన ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్థులపై మిగతా 2లో..



# భోగాపురం వేడుకలకు ధింసా సన్నాహాలు



**విజయనగరం, జూలై 30 :** అల్లూరి సీతారామరాజు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఘన స్వాగతం పలికేందుకు చేపడుతున్న ఏర్పాట్లను హోం మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో కలిసి ధింసా నృత్య ప్రదర్శనకు సంబంధించిన సన్నాహాలను సమీక్షించారు. ప్రారంభోత్సవ వేడుకల్లో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా భారీ స్థాయిలో ధింసా నృత్య ప్రదర్శన నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రదర్శనలో సుమారు 13 వేల మంది గిరిజన బాలికలు పాల్గొని సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించనున్నట్లు అధికారులు తెలిపారు.సన్నాహాల పరిశీలన సందర్భంగా నృత్య ప్రదర్శనలో పాల్గొనే బాలికలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. సాధన కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించడంతో పాటు భద్రత, తాగునీరు, వైద్య సదుపాయాలు, రవాణా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గిరిజనుల సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే విధంగా ఈ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించాలని మంత్రులు పేర్కొన్నారు. ధింసా నృత్యం ద్వారా ఆంధ్రప్రదేశ్ గిరిజనుల సంప్రదాయ కళా వైభవాన్ని ప్రతిష్ఠాత్మక వేదికపై ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం రాష్ట్ర అభివృద్ధిలో కీలక ఘట్టమని, ఈ సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని అధికారులు తెలిపారు. దేశ, విదేశాల నుంచి వచ్చే అతిథులకు రాష్ట్ర సాంస్కృతిక గొప్పతనాన్ని చాటిచెప్పేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొనే ఈ కార్యక్రమానికి అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రారంభోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని, రాష్ట్ర ప్రతిష్ఠను ప్రతిబింబించేలా ప్రతి అంశాన్ని పకడ్బందీగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# గ్లోబల్ ఇన్వెస్టర్ల ఎంపిక ఆంధ్రప్రదేశ్



రంగం పూర్తిగా అస్తవ్యస్తంగా ఉండేది. అంతకుముందు ఐదేళ్లలో కనీసం ఒక్క మెగావాట్ సామర్థ్యం గల ప్రధాన రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు కూడా ప్రారంభించలేదు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేశారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం దెబ్బతింది. ప్రపంచం లోని అనేక అతిపెద్ద ఇన్ఫ్రా, క్లైమెట్ ఫండ్స్ ఆంధ్రప్రదేశ్‌ను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాయి. ఒకసారి దెబ్బతిన్న విశ్వాసాన్ని పునరుద్ధరించడం రాత్రికి రాత్రే సాధ్యంకాదు. పెట్టుబడిదారుల్లో మళ్లీ నమ్మకాన్ని పెంపొందిస్తూ వచ్చాం.

**ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీతో తొలిఅడుగు**

ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ - 2024ను ప్రవేశపెట్టి విస్తృతమైన విజన్‌తో 160 గిగావాట్ల (+ఔ) క్లీన్ ఎనర్జీ సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. సోలార్ మాడ్యూల్స్, సెల్స్ నుండి బ్యాటరీలు, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, ట్రాన్స్ మిషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, పోర్ట్స్, స్టోరేజీ సిస్టమ్స్... ప్రపంచ స్థాయి తయారీ వరకు - మొత్తం క్లీన్ ఎనర్జీ సప్లయ్ చైన్ ను ఆంధ్రప్రదేశ్ లో నిర్మించాలని అనుకున్నాం. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగించుకోవడమే కాకుండా, క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలకు గ్లోబల్ ప్రొడ్యూసర్ గా మారాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

**టాటా రెన్యువబుల్ ప్రాజెక్ట్.. మా విజన్ కు నిదర్శనం**

టాటా రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ ?5,750 కోట్ల పెట్టుబడితో, పత్తికొండలో 400 మెగావాట్ల సౌర విద్యుత్‌ను, అనంతపురం జిల్లా కనేకల్లులో 400 మెగావాట్ల పవన విద్యుత్‌తో కలిపి, 800 మెగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుగా అవతరించబోతోంది. ఈ ఒక్క ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో దాదాపు 4,000 ఉద్యోగాలను కల్పిస్తుంది. 3,400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో గల ఈ ప్రాజెక్టు ద్వారా 1,100 పైగా రైతు కుటుంబాలకు దాదాపు మూడు దశాబ్దాల పాటు స్థిరమైన కౌలు ఆదాయాన్ని అందిస్తుంది. ఈ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌పైనా, మా పరిపాలనపైనా విశ్వాసానికి ప్రతీక.

**టాటా గ్రూప్ తో మాకు ప్రత్యేకమైన అనుబంధం**

టాటా గ్రూప్‌తో మాకు దశాబ్దాల తరబడి అనుబంధం ఉంది. 1990లో నా తండ్రి చంద్రబాబు నాయుడు గారు హైదరాబాద్‌లో 'హైటెక్ సిటీ'ని నిర్మిస్తున్నప్పుడు, ఆయన దార్శనికతను నమ్మిన మొట్టమొదటి సంస్థలలో టిసిఎస్ ఒకటి. ఆ నమ్మకంతో కూడిన అనుబంధం నేటికీ కొనసాగుతోంది. 2024లో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, నేను టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్‌ను కలిసి ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించడానికి ఆంధ్రప్రదేశ్ భిన్నంగా ఏమి చేయాలి అని అడిగాను. "వేగంపై దృష్టి పెట్టండి. పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాల కంటే జాప్యం వల్ల కలిగే నష్టమే ఎక్కువ," అని ఆయన చెప్పారు. మా ప్రభుత్వ విధానం కూడా Simple, Speed, Stability లో వేగం భాగం అయ్యింది. శంకుస్థాపన నుండి ప్రారంభోత్సవం వరకు ప్రభుత్వం మద్దతుగా నిలబడుతుందనే విశ్వాసం మేము పెట్టుబడిదారులకు కల్పిస్తున్నాం.

**స్వచ్ఛ ఇంధనం ఎగుమతి చేస్తాం**

భారతదేశంలోనే అత్యంత పొడవైన తీరప్రాంతం, సమృద్ధిగా పునరుత్పాదక వనరులు, ప్రపంచ స్థాయి ఓడరేవులు ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఎగుమతులకు భారతదేశపు ముఖద్వారంగా మారడానికి మాకు అవకాశం కల్పిస్తున్నాయి. అతి త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి అయ్యే స్వచ్ఛమైన ఇంధనాన్ని తీసుకువెళ్లే ఓడలు యూరప్, జపాన్, కొరియా, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తాయి. క్లీన్ మాలిక్యులస్, గ్రీన్ ఫ్యూయల్స్, సాంకేతికతలను ఎగుమతులూ ఏపీ నుంచి చేసే స్థాయికి చేరతాం.

**సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కలిసి పనిచేయాలి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఐఐటి తిరుపతి, యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (ఆస్ట్రేలియా) సహకారంతో సోలార్ మ్యానుఫ్యాక్చరింగ్, రెన్యువబుల్ ఎనర్జీ టెక్నాలజీల కోసం ఏర్పాటు చేస్తున్న ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కలిసి పనిచేయాలని టాటా పవర్‌ను ఆహ్వానిస్తున్నాం. మనం కలిస్తే భారతదేశపు స్వచ్ఛ ఇంధన భవిష్యత్తును నిర్మించే ఇంజనీర్లు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తలను తయారు చేయగలం. టాటా రెన్యువబుల్ ఎనర్జీ కార్యరూపం దాల్చడానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నాను.

**సుజ్లాన్‌కు ప్రత్యేక అభినందనలు**

దశాబ్దాలుగా, భారతదేశ పవన శక్తి రంగంలో సుజ్లాన్ అగ్రగామి పాత్ర పోషిస్తున్న సుజ్లాన్ పవన శక్తి ప్రాజెక్ట్ అభివృద్ధిలో భాగం కావడం ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక ఇంధన లక్ష్యాలకు గొప్ప బలాన్ని చేకూరుస్తుంది. ఈ ప్రాజెక్ట్ కోసం అవసరమైన విండ్ టర్బైన్‌లను అనంతపురంలోనే సుజ్లాన్ ఏర్పాటు చేసిన కేంద్రంలో తయారు కావడం ఏపీలో సమగ్ర పారిశ్రామిక వ్యవస్థ అభివృద్ధికి మరో నిదర్శనం.

## చంద్రబాబువి అన్నీ దుర్మార్గపు ఆలోచనలే: వైఎస్ జగన్

**శ్రీకాకుళం :** మాజీ మంత్రి సీదిరి అప్పల రాజు కుటుంబంపై చంద్రబాబు సర్కార్ కుట్రకు పాల్పడిందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. యాక్సిడెంట్‌ను హత్య కేసుగా మార్చి సీదిరి కుటుంబంపై కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరలేపిందన్నారు. అసలు యాక్సిడెంట్ కేసును హత్య కేసుగా ఎలా మారుస్తారు? అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. అంపోలు జైలులో ఉన్న సీదిరిని పరామర్శించేందుకు వెళ్లిన వైఎస్ జగన్.. అక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూటమి సర్కారు అరాచకాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. 'ఈ రోజు రాష్ట్రంలో కక్ష సాధింపు రాజకీయాలు జరుగుతున్నాయనే దానికి ఇదే నిదర్శనం. కనీసం మానవతా విలువలు లేకుండా మంచితనానికి పాతరేశారు. నీట్ రాసి.. తన తండ్రిలాగా డాక్టర్ అవ్వాలని అనుకున్నాడు సీదిరి కుమారుడు. తెలిసో తెలియకుండా యాక్సిడెంట్ చేశాడు. కానీ కేసును ట్విస్ట్ చేసి హత్య చేశాడని, కుట్ర చేసి సీదిరి కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారు. అనుకోని పరిస్థితుల్లో రోడ్డు ప్రమాదం జరిగితే.. ఆ పిల్లాడి జీవితాన్ని నాశనం చేయాలని చూడటం ఎంతవరకు సరైంది. బీసీల్లో సీదిరి మంచి నాయకుడు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కాబట్టి. చిన్న పిల్లాడు చేసిన యాక్సిడెంట్‌ను కుట్రగాను. హత్యగాను చిత్రీకరించి సీదిరి కుటుంబాన్ని ఇరికించే కార్యక్రమం ఎంతవరకు ధర్మం. అతిసామాన్యమైన కుటుంబం నుంచి వచ్చి వైద్యుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన అప్పల రాజును ఇబ్బంది పెట్టేలా తన కెరీర్‌ను నాశనం చేయాలని దుర్మార్గకపు ఆలోచన చేస్తున్నారు.18 ఏళ్ల విద్యార్థి జీవితాన్ని నాశనం చేస్తున్న చంద్రబాబు గడ్డి తింటున్నారా?. మనిషా? రాక్షసుడా?. ఇదే టీడీపీ నేతలు ఎవరైనా చేస్తే ఇలాగే శిక్షలు విధిస్తారా?. ఇదే శ్రీకాకుళం ఎమ్మెల్యే, పాతపట్నం ఎమ్మెల్యే యాక్సిడెంట్ చేస్తే.. ఈ కేసుల్లో ఎవరిని అరెస్టు చేశారు. ఒక్కొక్కరికి ఒక్కోలా చేస్తే వ్యవస్థ బతకదు. చంద్రబాబు విష విత్తనాలు నాటుతున్నారు. అదే వ్యవస్థను నాశనం చేస్తున్నారు. హత్య చేసేందుకు ప్రయత్నం చేస్తే.. ప్రమాదంలో గాయపడ్డ బాధితుడ్ని రక్షించేందుకు సీదిరి కుమారుడు ప్రయత్నించాడు. 108కి ఫోన్ చేశాడు. సీపీఆర్ చేశాడు. సీదిరి సైతం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు యాదవ మంత్రిని పంపించి ర్యాలీలు చేస్తారా?. అదే చంద్రబాబుకు బాధిత కుటుంబానికి మంచి చేయాలన్న మనసుంటే ఇరు కుటుంబాల మధ్య సయోధ్య చేకూర్చి బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చేసే ప్రయత్నం చేయాలి.పేదలంటే ప్రేమలేదు. బీసీలను ఓటు బ్యాంకు కోసం వాడుకుంటాడు. చంద్రబాబుకు బీసీలు కాదు యాదవులంటేనే ప్రేమలేదు. ప్రకాశం జిల్లాలో యాదవ కుటుంబం దాడి చేసి తిరిగి ఆ కుటుంబంపైనే కేసు పెట్టించిన ఘనుడు చంద్రబాబు. చరిత్రలో తొలిసారి యాదవ మహిళను వైఎస్సార్‌సీపీ విశాఖ మేయర్‌ని చేసింది. ఆ తర్వాత చంద్రబాబు కుట్రతో ఆమెకు పదవిని దూరం చేశాడు.




# మచిలీపట్నం పేరుతో యుద్ధ నౌక




తూర్పు తీరంలో సముద్ర అంతర్భాగంలో నిఘా నిర్వహించడం, శత్రు జలాంతర్గాములను గుర్తించి నిర్వీర్యం చేయడం, తక్కువ శ్రేణి సముద్ర కార్యకలాపాలను సమర్థంగా నిర్వహించడం వంటి బాధ్యతల కోసం ఈ యుద్ధ నౌకను వినియోగించనున్నట్లు వెల్లడించారు. ఆధునిక ఆయుధ వ్యవస్థలు, అత్యాధునిక నిఘా పరికరాలతో ఈ నౌక భారత నౌకాదళ శక్తిని మరింత పెంచుతుందని పేర్కొన్నారు.మచిలీపట్నం పోర్టు అభివృద్ధితో పాటు ఈ ప్రాంతానికి జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు వస్తోందని కొల్లు రవీంద్ర అన్నారు. ఒకవైపు పోర్టు నిర్మాణం వేగంగా కొనసాగుతుండగా, మరోవైపు మచిలీపట్నం పేరుతో యుద్ధ నౌక నిర్మాణం జరగడం ఈ ప్రాంత చరిత్రలో మరో గర్వకారణమని పేర్కొన్నారు. ఇది బందరు ప్రజలకు దక్కిన అరుదైన గౌరవంగా అభివర్ణించారు. మచిలీపట్నం పేరును భారత నౌకాదళ చరిత్రలో నిలిపే ఈ నిర్ణయం రాష్ట్ర ప్రజలకు కూడా గర్వకారణమని కొల్లు రవీంద్ర తెలిపారు. దేశ రక్షణలో కీలక పాత్ర పోషించే యుద్ధ నౌకపై మచిలీపట్నం పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఇది భావితరాలకు స్ఫూర్తిగా నిలిచే విశేష ఘట్టమని పేర్కొన్నారు.

# అంబటి ఇంటిపై దాడిని ఖండించిన పిన్నెల్లి




దాడులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడితో సమానమని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను హింసతో అణచివేయడం అంగీకారయోగ్యం కాదన్నారు. ప్రజాప్రతినిధుల భద్రతకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని పిన్నెల్లి ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. ఇలాంటి ఘటనలను అరికట్టడంలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం విఫలమైందని అన్నారు. అంబటి రాంబాబు వంటి ప్రజాదరణ కలిగిన నాయకుడి ఇంటిపై దాడి జరగడం వెనుక ప్రభుత్వ నిర్లక్ష్యం, పోలీసు వ్యవస్థ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులను గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. నిందితులపై తక్షణ చర్యలు తీసుకోకపోతే ప్రజల్లో అసంతృప్తి మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. చట్టం ముందు అందరూ సమానమేనని ప్రభుత్వం నిరూపించాలని సూచించారు. రాష్ట్రంలో రాజకీయ హింసకు తావులేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అంబటి రాంబాబు నివాసంపై జరిగిన ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సీదిరి పరామర్శకు జగన్ పర్యటన

**విశాఖ నుంచి శ్రీకాకుళానికి రోడ్డు మార్గంలో ప్రయాణం**

**జిల్లా జైలులో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పరామర్శించనున్న జగన్**

**దారిపొడవునా కార్యకర్తల ఘన స్వాగతం**

**పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం**




**రాజధాని వాయిస్ శ్రీకాకుళం, జూలై 30 :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం విశాఖపట్నం నుంచి రోడ్డు మార్గంలో శ్రీకాకుళం జిల్లాకు బయల్దేరారు. శ్రీకాకుళంలోని అంపోలు జిల్లా జైలులో ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పరామర్శించేందుకు ఆయన ఈ పర్యటన చేపట్టారు. పార్టీ వివరాల ప్రకారం, విశాఖపట్నం నుంచి బయల్దేరిన వైఎస్ జగన్‌కు మార్గమధ్యంలోని పలు ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, జెండాలతో ఆయనకు అభివాదం తెలియజేస్తూ పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. శ్రీకాకుళం చేరుకున్న అనంతరం అంపోలు జిల్లా జైలుకు వెళ్లి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పరామర్శించనున్నట్లు పార్టీ వెల్లడించింది. ఆయన ఆరోగ్య పరిస్థితి, ఇతర అంశాలపై ఆరా తీసి కుటుంబ సభ్యులను కూడా కలిసే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ పర్యటన నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశాయి. మార్గమధ్యంలో పలుచోట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతూ సంఘీభావం వ్యక్తం చేశారు. కాగా, ఈ పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లను పోలీసులు కట్టుదిట్టం చేశారు. జిల్లా జైలు పరిసరాలతో పాటు పర్యటన మార్గమంతా భద్రతను పెంచి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ కర్తవ్యం

## కోలగుట్లలో కదంతొక్కిన అభిమానం
## ఇంటింటికీ ప్రచారంలో బ్రహ్మారెడ్డికి బ్రహ్మరథం






**దుర్గి.జూలై 30 రాజధాని వాయిస్ :**అన్నివర్గాల ప్రజల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. గురువారం దుర్గి మండల పరిధిలో కోలగుట్ల, కంచరగుంట, ముటుకూరు, నెహ్రూనగర్ తండా గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం,ప్రతి ఇంటికి జూలకంటి ప్రచార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే కు ప్రజలు, కూటమి పార్టీల శ్రేణులు బ్రహ్మరథం పట్టారు. తదుపరి స్థానిక ఆంజనేయస్వామి దేవస్థానం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికంగా ఉన్న తెదేపా సృష్టికర్త అన్న ఎన్టీఆర్ పార్టీ సీనియర్ నాయకుడు తక్కెలపాటి రామకోటయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళు లర్పించి ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమా లను ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వంలో సాధించిన ప్రగతి కర పత్రాలను ప్రజలకు అందజేశారు. స్థానికంగా ఏ సమస్యఉన్న

నేతల దృష్టికి తీసుకొస్తే,దానిని తక్షణమే పరిష్కరించి, ఇబ్బందులు తొలిగేలా చర్యలు తీసుకుంటనని హామీ ఇచ్చారు. అనంతరం కంచరగుంట గ్రామంలో రూ. 36 లక్షల నిధులతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి, అక్కడున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. వైద్య సిబ్బందితో ముఖాముఖి నిర్వహించి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి శంకర్,దుర్గి మార్కెట్ యార్డ్ చైర్మన్ లింగా బ్రహ్మయ్య, మండల పార్టీ అధ్యక్షుడు జానకిరామయ్య, పార్టీ సీనియర్ నాయకు లు లింగ రమేష్, గరిణే రమేష్, తక్కెలపాటి హనుమంతరావు, సింగు నాగేశ్వరరావు, భీమనబోయిన నాగేశ్వరరావు, పొన్నూరు ఆదం,దేవబిక్షం, కృష్ణ, కోటేశ్వరరావు, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# భోగాపురం ఏర్పాట్లపై సమీక్ష

**ప్రధాని పర్యటనకు విద్యుత్ శాఖ సన్నద్ధం**
**నిరంతర విద్యుత్ సరఫరాపై ప్రత్యేక ఆదేశాలు**
**సౌర పథకాల అమలు వేగవంతం చేయాలని సూచన**
**ఉద్యోగాల పేరుతో మోసాలకు దూరంగా ఉండాలని హెచ్చరిక**




**విశాఖపట్నం, జూలై 30 :** భోగాపురంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలోని సీఎండీ కార్యాలయం నుంచి ఈపీడీసీఎల్ అధికారులతో గురువారం నిర్వహించిన వర్చువల్ సమీక్ష సమావేశంలో ఆయన ఏర్పాట్లను సమీక్షించారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతంగా జరిగేలా విద్యుత్ శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని సూచించారు. విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో పాటు అవసరమైతే అదనపు సిబ్బందిని క్షేత్రస్థాయిలో నియమించాలని మంత్రి ఆదేశించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే స్పందించేలా అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి సూర్యఘర్, కుసుమ్ పథకాల అమలును మరింత వేగవంతం చేయాలని సమావేశంలో మంత్రి అధికారులకు సూచించారు. సౌర విద్యుత్ వినియోగాన్ని విస్తరించడం ద్వారా విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ప్రజలకు ఈ పథకాల ప్రయోజనాలు విస్తృతంగా చేరేలా ప్రచారం, అమలు చర్యలను మరింత సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో విద్యుత్ నష్టాలను తగ్గించేందుకు భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఈ పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసి విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత విశ్వసనీయంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. విద్యుత్ శాఖలో ఉద్యోగ నియామకాలు పూర్తిగా ప్రతిభ ఆధారంగానే జరుగుతాయని గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఉద్యోగాల పేరుతో దళారులు చేసే తప్పుడు ప్రచారాన్ని నమ్మి ఎవరూ మోసపోవద్దని నిరుద్యోగ యువతకు విజ్ఞప్తి చేశారు. నియామకాల ప్రక్రియలో పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. విద్యుత్ శాఖను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు మౌలిక వసతుల అభివృద్ధి, సాంకేతిక ఆధునికీకరణ, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ప్రజలకు విశ్వసనీయ విద్యుత్ సేవలు అందించేందుకు అన్ని స్థాయిల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# జనాభా దినోత్సవ విజేతలకు సత్కారం

**రాజధాని వాయిస్ కాకినాడ, జూలై 30 :** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరిం చుకుని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిం చిన కార్యక్రమంలో ప్రపంచ జనాభా దినోత్సవం--2026 లక్కీ డ్రా విజేతలను ఘనంగా సత్కరించారు. విజేతలకు నగదు ప్రోత్సా హకాలను నేరుగా బదిలీ చేయడంతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జూలై 11 నుంచి 18 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కుటుంబ సంక్షేమం, తల్లి--శిశు ఆరోగ్యం, జనాభా నియంత్రణ, ఆరోగ్యకర జీవన విధానాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న వారిలో నిర్వహించిన లక్కీ డ్రా ద్వారా ఎంపికైన విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. అలాగే వారి భాగస్వామ్యాన్ని గుర్తిస్తూ ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు.జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు మాట్లాడుతూ కుటుం బ సంక్షేమ కార్యక్రమాలు, ఆరోగ్య సేవలపై ప్రజల్లో అవగాహన పెంపొందిం చేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని




తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో ఆరోగ్య లక్ష్యాలను మరింత సమర్థవంతంగా సాధించవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రజలను భాగస్వాములను చేసే దిశగా చర్యలు కొనసాగిస్తామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు.

# మృతుల కుటుంబాలకు భువనేశ్వరి పరామర్శ

**సాయిబాబా, గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు**
**కార్యకర్తల చిత్రపటాలకు నివాళులు**
**పార్టీ అండగా ఉంటుందని భరోసా**




**రాజధాని వాయిస్ కుప్పం, జూలై 30** :కుప్పం నియోజకవర్గం లో నాలు గో రోజు పర్యటన కొనసాగిస్తున్న నారా భువనేశ్వరి గురువారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా హెచ్‌పి రోడ్డులోని సాయిబాబా ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కొత్తపేటలోని ప్రసన్న పెద్దపల్లి గంగమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయ దర్శనాల అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అన్వార్ బాషా, చిన్ని నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. వారి బాధలో తాము భాగస్వాములమని, అధైర్యపడవద్దని సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ కోసం సేవలందించిన కార్యకర్తల సేవలను గుర్తు చేసుకుంటూ వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులతో కొంతసేపు మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు.కార్యకర్తల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా పార్టీ తరఫున చర్యలు తీసుకుంటామని భువనేశ్వరి హామీ ఇచ్చినట్లు తెలుగుదేశం పార్టీ వెల్లడించింది. పార్టీ కార్యకర్తల సంక్షేమానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తామని, వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని పేర్కొన్నట్లు తెలిపింది. భువనేశ్వరి పర్యటన సందర్భంగా స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయాల వద్ద, పరామర్శ కార్యక్రమాల్లో ఆమెకు స్వాగతం పలికి వెంట నడిచారు. కుప్పం నియోజకవర్గంలో చేపడుతున్న పర్యటనలో ప్రజలతో పాటు పార్టీ శ్రేణులను కూడా కలుస్తూ వారి సమస్యలను తెలుసుకుంటున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా కుప్పం నియోజకవర్గంలోని పలు గ్రామాలు, కాలనీల్లో భువనేశ్వరి పర్యటిస్తున్నారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతూ స్థానిక సమస్యలను తెలుసుకోవడం, పార్టీ కార్యకర్తలను పరామర్శించడం, సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా నియోజకవర్గంతో నిరంతర అనుబంధాన్ని కొనసాగిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ తెలిపింది.

# డ్రోన్లతో పోలీసుల నిరంతర నిఘా

**– క్రైమ్ ప్రోన్ ప్రాంతాలపై ప్రత్యేక పర్యవేక్షణ – జిల్లా ఎస్పీ ఆదేశాలతో చర్యలు**
**– నేరాల నియంత్రణే ప్రధాన లక్ష్యం – అత్యాధునిక సాంకేతికతతో భద్రత కట్టుదిట్టం**




**రాజధాని వాయిస్ బాపట్ల, జూలై 30 :** జిల్లాలో నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు బాపట్ల పోలీసులు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నేరాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలపై డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు. నేరాల నివారణతో పాటు ప్రజలకు మరింత భద్రత కల్పించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని పోలీసు అధికారులు తెలిపారు. జిల్లాలో నేరాలు ఎక్కువ గా జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేపట్టారు. రహదారులు, నిర్మానుష్య ప్రాంతాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, అనుమానాస్పద కదలికలు కనిపించే ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నారు. డ్రోన్ల ద్వారా లభించే దృశ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.నేరస్తుల కదలికలను ముందుగానే గుర్తించడం, చోరీలు, దోపిడీలు, ఇతర నేర కార్యకలాపాలను అడ్డుకోవడం కోసం ఈ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అనుమానాస్పద పరిస్థితులు గుర్తించిన వెంటనే సమీప పోలీసు సిబ్బందికి సమాచారం అందించి తక్షణ చర్యలు తీసుకునేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. డ్రోన్ నిఘాతో పోలీసుల పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా మారుతుందని అధికారులు పేర్కొన్నారు. విశాలమైన ప్రాంతాలను తక్కువ సమయంలో పరిశీలించడంతో పాటు, సాధారణంగా చేరుకోవడం కష్టమైన ప్రాంతాలపై కూడా నిఘా ఉంచేందుకు ఇది ఉపయోగప డుతోందని తెలిపారు. నేర నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు.జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు లేదా అత్యవసర సేవలకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భాగస్వామ్యంతో నేరాలను మరింత సమర్థంగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ బాపట్ల జిల్లా పోలీసులు ఆధునిక పద్ధతుల్లో నిఘా చర్యలను కొనసాగిస్తున్నారు. డ్రోన్ పర్యవేక్షణతో పాటు సాధారణ గస్తీ, ప్రత్యేక తనిఖీలు, గూఢ చారి సమాచార సేకరణ వంటి చర్యలను కూడా సమాంతరంగా అమలు చేస్తున్నారు.

# కూటమి పాలన విజయాల ప్రచారం

**నందిగామలో ఇంటింటికీ కరపత్రాల పంపిణీ**
**ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన**
**అభివృద్ధికి కూటమి ప్రభుత్వమే కట్టుబాటు**
**ప్రజలతో మమేకమైన తంగిరాల సౌమ్య**



**రాజధాని వాయిస్ నందిగామ, జూలై 30 :** ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతాయని ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ పట్టణంలోని 9వ వార్డు ముక్కపాటి కాలనీలో గురువారం నిర్వహి ంచిన 'అభివృద్ధి--సంక్షేమానికి రెండేళ్ల నమ్మకం.. కూటమి ప్రభు త్వం' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా తంగిరాల సౌమ్య ప్రజలను నేరుగా కలిసి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. వివిధ వర్గాల ప్రజలకు అందుతున్న సంక్షేమ ప్రయోజనాలు, రాష్ట్రంలో చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సేవలకు సంబంధించిన కార్యక్రమాలను వివరించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలను కూడా అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఆమె అన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, మౌలిక వసతులు, ఉపాధి వంటి రంగాల్లో అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం పలు రంగా ల్లో వెనుకబడిందని తంగిరాల సౌమ్య విమర్శించారు. అభివృద్ధి కార్యక్రమాలు మందగించడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి మార్గంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా చర్యలు చేపడుతోందని ఆమె అన్నారు.రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందని తంగిరాల సౌమ్య తెలిపారు. ప్రజల సహకారంతో అన్ని రంగాల్లో పురోగతి సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు కొనసాగుతాయని వివరించారు. నందిగామ నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం సహకరిస్తోందని తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదాలతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రచార కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

# తెనాలిలో డ్రగ్స్ వద్దు బిడ్డ ప్రచార చిత్రం ప్రారంభం

**తెనాలి.జూలై 30,రాజధాని వాయిస్:** తెనాలి పట్టణం గాంధీ చౌక్ లో ప్రముఖ దర్శకుడు దిలీప్ రాజా దర్శకత్వంలో రూపొందుతున్న ప్రచార చిత్రం డ్రగ్స్ వద్దు బిడ్డ చిత్రీకరణ బుధవారం ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ముఖ్య అతిథిగా హాజరై సినిమా ప్రారంభానికి క్లాప్ కొట్టారు. ఏపీ మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ కెమెరా స్విచ్ ఆన్ చేసి చిత్రీకరణను ప్రారంభించారు.నాటి సినీ హీరో నరసింహ రాజు, నటీమణులు రమ్య రాథోడ్, భవాని కపూర్ తో పాటు సినిమా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ,యువత డ్రగ్స్ కి బానిస కావద్దని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, చిన్న తప్పటడుగుతో జీవితాలు నాశనం చేసుకోవద్దని కోరారు.మహిళా చైర్పర్సన్ రాయపాటి శైలజ మాట్లాడుతూ,యువత చెడు అలవాట్లను మానుకుని మంచి మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఎవరైనా ప్రోత్సహించినా డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని, సమాజంలో మంచి గుర్తింపు పొంది యువత ఆదర్శంగా నిలవాలని అన్నారు.దర్శకులు దిలీప్ రాజా మాట్లాడుతూ,ఈ సినిమా ద్వారా ఏపీలో ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు గొప్ప అవగాహన కలుగుతుందని తెలిపారు. చదువుకున్న యువత మంచి పట్ల ఆకర్షితులై ఉండాలని, డ్రగ్స్ కి బానిసైతే జీవితాలు చిన్నాభిన్నమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ కోరిక మేరకు ఈ



అవగాహన ప్రచారచిత్రాన్ని నిర్మిస్తున్నామని, దృశ్య మాధ్యమం ద్వారా ప్రజలకు డ్రగ్స్ ప్రమాదాలపై సందేశం అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ పూజ,మున్సిపల్ ఇంచార్జి కమీషనర్ జె.రామారావు,లత, మైనేని హరి, శ్రీనివాస్,బాలకృష్ణ, సముద్రాల శ్రీధర్ శర్మ, మల్లెపాడు రమేష్ ,సైదులు యాదవ్, ఆష,,జ్యోతి పాల్గొన్నారు.

# శ్రీ వైష్ణవి విద్యాసంస్థల్లో న్యాయ విజ్ఞాన సదస్సు

**సత్తెనపల్లి.జూలై 30,రాజధాని వాయిస్:**ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు,సత్తెనపల్లి న్యాయ సేవాధికార మండల కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వి. విజయ్ కుమార్ రెడ్డి సూచనలతో సత్తెనపల్లి పట్టణంలోని శ్రీ వైష్ణవి విద్యాసంస్థలు – ప్రగతి జూనియర్, డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్యానెల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా సమాజానికి పెను ముప్పుగా మారిందన్నారు. కొందరు ముఠాలుగా ఏర్పడి మహిళలు, చిన్నారులు, నిరుపేదలను మోసం చేసి అక్రమ రవాణాకు పాల్పడటమే కాకుండా, వారిని బలవంతంగా భిక్షాటన చేయిస్తూ అక్రమంగా లాభాలు పొందుతున్నారని వివరించారు. ఇలాంటి నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ బ్రహ్మరెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు ఎంతో విలువైనదని,విదేశాల్లో ఉద్యోగాలు, అధిక వేతనాలు, సినిమా, సెలెబ్రేటీ, స్పోర్ట్స్ అవకాశాలు, ఇప్పిస్తామంటూ, ప్రముఖులుగా తీర్చిదిద్దుతామని వచ్చే మోసపూరిత ప్రకటనలను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. ఉద్యోగాలు,



విద్యా అవకాశాల పేరుతో వచ్చే ప్రతి సమాచారాన్ని అధికారికంగా ధ్రువీకరించుకుని మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు కోటగిరి లక్ష్మణ్, గుర్రం పవన్, తెనాలి నవజ్యోతి బాబు, కళాశాల డైరెక్టర్ బ్రహ్మరెడ్డి, పారా లీగల్ వాలంటీర్లు షేక్ సుభాని, అట్లూరి జ్యోతి, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాదాయ భూమిలో శ్రీ చక్ర కర్మాగారం...?

## కొనుగోలకు ముందుకు రాని వ్యాపారులు
## సన్నద్ధంలో యాజమాన్యం

**కారంపూడిజూలై30రాజదాని వాయిస్ :**మండల కేంద్రమైన కారంపూడి సమీపంలోని దేవాదాయ శాఖ భూమిలో నిర్మించిన శ్రీ చక్ర కర్మాగారం పరిస్థితి దయనీయంగా మారింది. 1982 సంవత్సరంలో పార్థసారథి సిమెంట్ ఫ్యాక్టరీ పేరుతో స్థాపించిన కర్మాగారం అంచలంచలుగా అభివృద్ధి చెందింది.శ్రీ సింగరట్ల లక్ష్మీనరసింహస్వామి సుమారు 4018 ఎకరాల భూమి ఉంది అందులో శ్రీ చక్ర యాజమాన్యం 462 ఎకరాల భూమి లో కర్మాగారం, మైన్స్, సిబ్బంది క్వార్టర్స్, ఏర్పాటు చేశారు. ప్రతి 11 సంవత్సరాలకు ప్రభుత్వ ఒప్పందంతో అగ్రిమెంట్ రాసుకొని దేవాదాయ శాఖకు రుసుము చెల్లించేవారు. గత ఆరు నెలల నుండి దేవాదాయ శాఖకు 24 లక్షల రూపాయలు బకాయిలు ఉన్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు. గ్రామపంచాయతీకి 5 లక్షల 50 వేలు రూపాయలు బకాయిలు ఉండగా విద్యుత్ శాఖకు భారీ బకాయిలు చెల్లించాలని తెలుస్తుంది. స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు కర్మాగారంకు సంబంధం లేకపోవటంతో స్వయంగా యాజమాన్యమే జిల్లా అధికారులతో సంప్రదింపులు జరిపి బకాయిలు చెల్లించేవారు. ఇప్పటికీ భారీ స్థాయిలో విద్యుత్ బకాయిలు ఉన్నట్టు తెలుస్తుంది. సామాన్యుడు ఒక నెల బకాయిలు చెల్లించకపోయిన దీర్ఘకాలింగా బకాయిలు చెల్లించకపోయిన విద్యుత్ సరఫరా నిలిపివేసి నోటీసులు జారీ చేసే విద్యుత్ అధికారులు. శ్రీ చక్ర కర్మాగారం పై మమకారం చూపుతున్నట్లు తెలుస్తుంది. సింగరట్ల లక్ష్మీనరసింహస్వామి మాన్యంలో 784 ఎకరాల భూమిని ఇప్పటికి పేద మధ్యతరగతి రైతులు సాగు చేసుకుంటున్నారు.

భూమి ఉన్న పూజలకు సానుకూలంగా జరుగుతున్నాయని సింగరట్ల లక్ష్మీనరసింహస్వామి భక్తులపై దయ చూపుతున్నారు.

**యాజమాన్యం కొనుగోలు చేసిన భూముల పరిస్థితి ఏమిటి...!**

గతంలో శ్రీ చక్ర యాజమాన్యం సాగు చేసుకుంటున్నా రైతులు భూములను మధ్యపెట్టి వారి భూములు కూడా కొనుగోలు చేశారు.ఒక్కో రైతు నుండి తక్కువ ధరకు భూమి కొనుగోలు చేసి శ్రీ చక్ర అని స్తంభాలు కూడా బాదిన సందర్భాలు ఉన్నాయి. నేటి పరిస్థితి చూసుకుంటే వారి పరిస్థితి ఏమిటి అని ప్రశ్నార్థకంగా మారింది.

**తహసిల్దార్: వెంకటేశ్వర్లు నాయక్**

ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ సింగరట్ల లక్ష్మీనరసింహస్వామి మాన్యం విలువైందని రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని ఇప్పటికి కూడా సాగు చేసుకున్న రైతులు



భూములకు కోసం తమ దగ్గరకు వచ్చారని నివేదికను ఉన్నత అధికారులు దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. 1960 సంవత్సరం నుండి దేవాదాయ భూమిపై వివాదం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎంత వివాహం జరిగిన ఒక కొలిక్కి రావట్లేదని ఆయన తెలిపారు. పూర్తిస్థాయి రెవిన్యూ రికార్డులను పరిశీలించామని ఆయన తెలిపారు.

**దేవాదాయ శాఖ ఈవో: శివ నాగిరెడ్డి**

అన్ని హంగులు ఉన్న అభివృద్ధికి నోచుకొని సింగరట్ల లక్ష్మీనరసింహస్వామి అని ఆయన అన్నారు.

ప్రతి శనివారం స్వామివారికి దీప ధూపం నైవేద్యాలతో అన్ని ఏర్పాటు చేస్తున్నామని భూములు ఉన్న ఉపయోగం లేకుండా పోయిందని ఆయన తెలిపారు. బకాయిల భారీగా పేరుకొని ఉన్నాయని అన్నారు. దేవాలయ అభివృద్ధికి రెండు కోట్ల రూపాయలు కూటమి ప్రభుత్వం అభివృద్ధికి కేటాయించిందని. 33% విరాళాలు ఇవ్వాలని ఆదేశాలు ఉన్న సింగరట్ల లక్ష్మీనరసింహస్వామికి మాత్రం ఆదాయం సమకూర్చటంలో భూములు సాగు చేసుకుంటున్న రైతుల మాత్రం కరుణించడం లేదని ఆయన తెలిపారు.

# రాయలసీమ సాగునీటి హక్కుల కోసం పాదయాత్ర

**రాజధాని వాయిస్** శ్రీ సత్యసాయి జిల్లా, జూలై 30 : రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేసి లక్షలాది మంది రైతులకు శాశ్వత సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర నిర్వహిం చారు. సి.కె.పల్లి మండలం న్యామద్దల గ్రామం నుంచి హంద్రీనీవా కాలువ వరకు మాజీ మంత్రి, శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ నాయకత్వంలో ఈ పాదయాత్ర జరిగింది. రాయలసీమ సాగునీటి హక్కుల సాధన కోసం తమ ఉద్యమం నిరంతరం కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు. పాదయాత్ర అనంతరం ఉషశ్రీ చరణ్ మీడియాతో మాట్లాడుతూ, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం జరుగుతున్న పోరాటం ఒక ప్రాంతం కోసం కాదని, లక్షలాది మంది రైతుల హక్కుల కోసం జరుగుతున్న ఉద్యమమని అన్నారు. కరువు నేలగా మిగిలిన రాయలసీమను సస్యశ్యామలంగా మార్చే శక్తి ఈ ప్రాజెక్టుకే ఉందని పేర్కొన్నారు. రైతుల భవిష్యత్తు, ప్రాంత అభివృద్ధి కోసం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని పెంచి రాయలసీమకు కృష్ణా జలాలను అందించారని ఉషశ్రీ చరణ్ గుర్తు చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు సుమారు 80 శాతం పూర్తయ్యాయని, ఆ ప్రాజెక్టు పూర్తయి ఉంటే రాయలసీమలో నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమ య్యేదని పేర్కొన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయ ంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఉషశ్రీ చరణ్ ఆరోపించారు. చంద్రబాబు నాయుడు తెలంగాణ ప్రభుత్వం తో కుమ్మక్కై ఈ ప్రాజెక్టును నిలిపివేశారని విమర్శించారు. తెలంగా ణ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై చంద్రబాబు స్పందించలేదని, ఆల్మట్టి ఎత్తు పెంపు, తెలంగాణ ప్రాజెక్టుల అంశాల్లో కూడా మౌనం పాటిస్తున్నారని ఆరోపించారు.హంద్రీనీవా కాలువల లైనింగ్ పనుల్లో జరిగిన నాసిరకం నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఉషశ్రీ చరణ్ డిమాండ్ చేశారు. ప్రజాధనం వృథా చేసిన కాంట్రాక్టర్ల నుంచి నష్టాన్ని వసూలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మండల న్యాయసేవ కమిటీ మాచర్ల ఆధ్వర్యంలో అక్రమ మానవ రవాణా వ్యతిరేక న్యాయ అవగాహన సదస్సు



**మాచర్ల.జులై 30 రాజధాని వాయిస్ :**మండల న్యాయ సేవ కమిటీ మాచర్ల ఆధ్వర్యంలో అక్రమ మానవ రవాణా వ్యతిరేకంగా రాయవరం జంక్షన్ లో గల ఇండో అమెరికన్ పాఠశాల నందు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాన జూనియర్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా వేద రూపాల్లో జరుగుతుందని వాటిని అరికట్టవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. ముఖ్యంగా పిల్లలు బాలికలు మహిళలు అక్రమ సంపాదన కోసం అక్రమ రవాణా బాధితులుగా మారుతున్నారని కాబట్టి ప్రతి ఒక్కరూ పిల్లలను మహిళలను ఈ అక్రమ రవాణా అపత్తులో పడకుండా కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ న్యాయవాది జి వెంకటేశ్వర్లు మాచర్ల అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షులు గౌస్ బాషా న్యాయవాదులు పుల్లారావు, బీబీ పుల్లారావు మరియు బ్రహ్మచారి కళాశాల కరస్పాండెంట్ జక్కిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, మండల న్యాయ సేవ కమిటీ సభ్యులు మెట్టు గోవింద రెడ్డి పాల్గొన్నారు.

# న్యూటన్స్ విద్యార్థుల ప్రతిభ



**మాచర్ల. జులై 30రాజధాని వాయిస్ :** పట్టణ సమీపంలోని న్యూటన్స్ గ్రూప్ అఫ్ ఇన్స్టిట్యూ షన్ లో ఈ నెల 30వ తేదీన గురువారం రోజు జరిగిన క్యాంపస్ డ్రైవ్ లో కళాశాల విద్యార్థులు 34 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. ఈ కంపెనీ హైదరాబాద్ కు చెందిన క్యూ స్పైడర్ వారు క్యాంపస్ డ్రైవ్ ను నిర్వహించారు. వార్షిక ఆదాయం 5.5 లక్షలు. హెచ్. ఆర్ మేనేజర్ గా కీర్తి, చైతన్య లు వ్యవహరించారు. ఉద్యోగాలను సాధించిన విద్యార్థిని విద్యార్థులకు కళాశాల కరెస్పాండెంట్ జున్నా శ్రీనివాస రెడ్డి , కళాశాల అకాడమిక్ డైరెక్టర్ జున్నా చక్రధర్ రెడ్డి , కళాశాల ప్రిన్సిపాల్ డా. యస్.యన్ నరసింహరావు , వైస్ ప్రిన్సిపాల్. బి. నరసింహారావు, టి. పి. ఓ. వై.రాజారెడ్డి కళాశాల ఎ. ఓ ఖాసీం , హెచ్ఓడి లు, అధ్యాపకులు,కళాశాల సిబ్బంది. ఎంపిక అయినా విద్యార్థి, విద్యార్థులను అభినందించారు.

# మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్




**గుంటూరు.జూలై 30 రాజధాని వాయిస్ :**ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోస్టర్ నుజిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ పోస్టర్ ను షాడోస్ మరియు వెట్టి చాకిరి విమోచన కోయిలేషన్ సంస్థ తయారు చేసింది. మానవ అక్రమ రవాణా నిరోధక అవగాహన కార్యక్రమం ఎంతో అవసరం అన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎ. గాయత్రి దేవి, షాడోస్ మరియు వెట్టి చాకిరి విమోచన కోయిలేషన్ సంస్థ ప్రతినిధులు ఏ. రాజ సాల్మన్, భాగ్యలక్ష్మి, అలేఖ్య, పావని, డిబిఆర్సి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# బుడగ జంగాల కాలనీలో అగ్నిప్రమాద బాధితులకు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆర్థిక సాయం



**దుర్గి.జూలై 30 రాజధాని వాయిస్ :** దుర్గి గ్రామంలోని బుడగ జంగాల కాలనీలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో నడికొండ కృష్ణయ్య, నడికొండ రాములు అనే అన్నదమ్ముల పూరి గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయి.ఈ ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితుల కుటుంబాలను పల్నాడు జిల్లా వైయస్ఆర్సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులకు అండగా నిలుస్తూ ఒక్కో కుటుంబానికి రూ. 35,000/- చొప్పున ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. కష్టకాలంలో ఉన్న వారిని పరామర్శించి, ప్రభుత్వం మరియు పార్టీ తరఫున తగిన ఆసరా కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com